
సాక్షి
విజయనగరం

శనివారం। 20। మే। 2023



గ్యాస్ సిలిండర్ పేలి రెండిళ్లు దగ్ధం

రేగిడి మండల పరిధిలోని పొరాం గ్రామంలో శుక్రవారం సాయంత్రం గ్యాస్ సిలిండర్ పేలి రెండిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. -10లో



మౌలిక సదుపాయాలు

సిప్లా పథకం కింద విభిన్న ప్రతిభావంతులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జేసీ అశోక్ సూచించారు. -10లో



చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

పేదల ఇళ్లు సమాధులంటూ టీడీపీ నేత చంద్రబాబు నాయుడు పేర్కొనడంపై జనం మండిపడ్డారు. -10లో

న్యూస్‌రీల్

శివారు భూములకు సాగునీరు

రాజాం సిటీ: తోటపల్లి కాలువల ద్వారా వచ్చే ఖరీఫ్‌లో శివారు భూములకు సాగునీరందించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్టు డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. రాజాం మండల పరిధిలోని పొగిరి, అంతకాపల్లి, సోపేరు తదితర గ్రామాల వద్ద తోటపల్లి కాలువలో పూడికల తొలగింపు పనులను శుక్రవారం పరిశీలించారు. తోటపల్లి ప్రాజెక్టు నుంచి మూడు పంటలకు నీరందించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్టు వెల్లడించారు. వచ్చే ఖరీఫ్ నుంచి సాగునీటి ఇబ్బందులు ఉండవన్నారు.

విజయనగరం అదనపు ఎస్పీగా అస్మాపర్వీన్



అస్మా పర్వీన్, జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)

విజయనగరం క్రైమ్: కృష్ణా జిల్లా అదనపు ఎస్పీగా పనిచేస్తున్న అస్మా పర్వీన్ జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా నియమిస్తూ రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్‌గుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. సెబ్ అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వహించాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో సెబ్ అదనపు ఎస్పీగా కృష్ణా జిల్లా నుంచి అటాచ్‌మెంట్‌పై ఆమె పనిచేస్తున్నారు. 2012లో పోలీసుశాఖలో డైరెక్ట్ డీఎస్పీగా ఎంపికైన అస్మా పర్వీన్ రాజమండ్రి పోలీస్ శిక్షణ కళాశాలలో డీఎస్పీ హోదాలో పనిచేశారు.

ఉద్యోగాలకు 372 మంది అర్హత



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి అరుణ

విజయనగరం రూరల్: జిల్లా ఉపాధి కార్యాలయం, ఏపీఎస్ఎస్‌డీసీ ఎంఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నగరంలోని ఏపీఎస్ఎస్‌డీసీ ఎంఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 700 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. అరబిందో ఫార్మా కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో తదుపరి రౌండ్‌కు 372 మంది అర్హత సాధించినట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా జిల్లా ఉపాధి కార్యాలయం, ఏపీఎస్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వం జాబ్‌మేళాలు నిర్వహిస్తోందన్నారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు, ప్రొఫెసర్ ఎం.యశ్వంత్‌బాబు, జిల్లా ఉపాధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్స్ అందజేత



బాధితురాలికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లాలో పోగొట్టుకున్న మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు గతేడాది ప్రారంభించిన వెబ్‌పోర్టల్ బాధితులకు ఉపయోగకరంగా మారింది. ఈ వారంలో పోగొట్టుకున్న 26 స్మార్ట్ ఫోన్‌లను రికవరీ చేసినట్టు ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం తెలిపారు. ఈ మేరకు బాధితులకు సెల్‌ఫోన్‌లను తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సైబర్ సెల్ ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

మామిడి రైతులకు మేలు



లొట్లపల్లిలో మామిడి కాయల కలెక్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

జామి: మామిడి రైతులకు మేలుచేసేలా జామి మండలం లొట్లపల్లిలో ప్రభుత్వం నిర్మించిన మామిడికాయల కలెక్షన్ సెంటర్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ మయూర్ అశోక్ కోరారు. కలెక్షన్ సెంటర్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం మామిడి రైతులతో మాట్లాడి కష్టసుఖాలు తెలుసుకున్నారు. మామిడి తాండ్ర కోల్డ్‌స్టోరేజీని పరిశీలించి నిల్వ సామర్థ్యంపై ఆరా తీశారు. జామిలో పీఎంఎఫ్ఈ పథకం కింద మంజూరైన ఐస్‌క్రీమ్ తయారీ యూనిట్‌ను, ఉత్పత్తి, మార్కెటింగ్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంబ్రాయిడర్ యూనిట్‌ను సందర్శించారు. ఆదాయ, వ్యయాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఏపీఎస్‌వీ జమదగ్ని, శ్యామ్‌కుమార్, అనిత, తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఏఓ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సేవలకు వందనం

- పారదర్శకంగా సేవలందించేందుకే వలంటీరు వ్యవస్థ
- కోవిడ్ సమయంలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు
- కలెక్టరేట్ ఆడిటోరియంలో వలంటీర్లకు పురస్కారాల ప్రదానం



వలంటీర్లకు మెగాచెక్కును అందజేస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, రఘురాజు, ఎమ్మెల్యేలు శంబంగి, కంబాల జోగులు తదితరులు

విజయనగరం ఫోర్ట్: గత టీడీపీ ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో చేసిన దోపిడీలు, తప్పిదాలకు చెక్‌పెడుతూ... అర్హతే ప్రామాణికంగా, పారదర్శకంగా, అవినీతి రహితంగా ప్రభుత్వ పథకాలు, సేవలు క్షేత్రస్థాయిలో అందజేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విపత్కర కాలంలో ఆదుకునే గొప్పశక్తిగా వలంటీరు వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. సంక్షేమ పథకాలు ఎవరు అందిస్తున్నారని గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రశ్నిస్తే... తొలుత సీఎం జగన్‌మోహన్ రెడ్డి, తర్వాత వలంటీరు పేరు చెబుతుండడం ఆనందదాయకమన్నారు. అదే స్ఫూర్తితో ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవచేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆశయాన్ని సాకారం చేయాలని పిలుపునిచ్చారు. పేదవారికి కష్టం వస్తే వారి కుటుంబ సభ్యులు కంటే ముందుగా వలంటీర్‌కు ఫోన్ చేస్తున్నారంటే వారి సేవలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎక్కడా ఒక్కరూపాయి లంచం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి ఆశయాలను నిజంచేసే సైనికులు వలంటీర్లు అని పేర్కొన్నారు. వలంటీర్‌ను సత్కరిస్తే ప్రతి పేదవాడిని సత్కరిస్తున్నట్టు ప్రభుత్వం భావిస్తోందన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ గ్రామాలు, వార్డుల్లో వారికి కేటాయించిన కుటుంబాల్లోని అర్హులకు ప్రభుత్వం అమలుచేసే ప్రతి పథకాన్ని చేరవేసే వలంటీరు వ్యవస్థ గొప్పదన్నారు. వారికి అప్పగించిన పనిని తప్పులు లేకుండా చేస్తున్నారని కొనియాడారు. వలంటీరు వ్యవస్థకు దేశంలోనే మంచి పేరుందన్నారు. 2023 సంవత్సరానికి జిల్లాలో 9997 మంది వలంటీర్లకు రూ.10.22 కోట్లను ఎన్‌టీఆర్ జిల్లాలో జరిగిన సభ నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల ఖాతాల్లో జమ చేసినట్టు వెల్లడించారు. వీరిలో 36 మందికి సేవావజ్ర పురస్కారం కింద రూ.10.80 లక్షలు, సేవారత్న కింద 160 మందికి రూ.32లక్షలు, సేవామిత్ర కింద 9,801 మందికి రూ.9.80 కోట్లకు సంబంధించిన నమూనా చెక్కును వలంటీర్లకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, కంబాల జోగులు, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జెడ్పీ సీఈఓ ఎం.అశోక్‌కుమార్, డీపీఓ శ్రీధర్‌రాజా తదితరులు పాల్గొన్నారు.



వలంటీరును సత్కరిస్తున్న, అతిథులు, కలెక్టర్

నగదు పురస్కారానికి ‘ఆదర్శ’ బాలికలు



సింగంపల్లి జయశ్రీ



మనోజ్‌సాయిశ్రీ

కొత్తవలస: ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని సింగంపల్లి జయశ్రీ 587 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకులో నిలిచింది. ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50వేలు నగదు బహుమతి అందజేయనుంది. అలాగే, ఇదే పాఠశాలకు చెందిన ఉగ్గిన మనోజ్‌సాయిశ్రీ 580 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. ఆమెకు ప్రభుత్వం రూ.15వేలు నగదు పురస్కారం ఇవ్వనున్నది. ఇద్దరు బాలికలను పాఠశాల ప్రిన్సిపాల్ పి.శివప్రసాద్, సిబ్బంది అభినందించారు.

అబద్ధాలతో ఇంకెన్నాళ్లు చంద్రబాబు?

- ఉమ్మడి విజయనగరం జిల్లాకు మీ హయాంలో చేసిన అభివృద్ధి పని ఒక్కటీ లేదు
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆడిపోసుకునేందుకే రోడ్డుషో
- చంద్రబాబు మాటలు నమ్మడానికి, వినడానికి ఉత్తరాంధ్ర ప్రజలు అమాయకులు కాదు
- మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: అబద్ధాలతో ప్రజలను ఇంకెన్నాళ్లు మోసం చేస్తావని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడును జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద ఆయన మీడియాతో శుక్రవారం మాట్లాడారు. పేదల ఇళ్లను సమాధులతో పోల్చడంపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక.. రోడ్‌షోలో లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. ఎన్ని షోలు చేసినా, అబద్ధాలు చెప్పినా నిన్ను నమ్మి మోసపోవడానికి ఉత్తరాంధ్ర ప్రజలు అమాయకులు కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే ఉమ్మడివిజయనగరం జిల్లా ప్రగతిపథంలో పయనిస్తోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు గిరిజన యూనివర్సిటీ పెట్టానని, ఇప్పుడు ఏమయ్యిందని అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిజంగా గిరిజనుల పట్ల అభిమానం ఉన్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గిరిజన యూనివర్సిటీని సాలూరు ప్రాంతానికి మంజూరు చేశారని గుర్తుచేశారు. దాదాపు 560 ఎకరాల భూసేకరణ పూర్తయ్యిందని మరికొద్ది రోజుల్లో జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా శంకుస్థాపన చేస్తారన్నారు. జేఎన్‌టీయూను జిల్లాకు తెచ్చినది, వర్సిటీగా స్థాయి పెంచినది ఎవరో విద్యార్థిలోకానికి తెలుసన్నారు. నిజంగా 2014-19 పరిపాలన కాలంలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చంద్రబాబు ఏదైనా అభివృద్ధి చేసి ఉంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు గురించి ఏనాడు పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు తానే ఆ ప్రాజెక్టు పనులు ప్రారంభించానని చెప్పుకోవడం శోచనీయమన్నారు. పెందుర్తి నుంచి బొద్దవర వరకు నాలుగు లైన్ల రహదారి పనులు ప్రారంభించినది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాలిస్తుంటే కోర్టుకు వెళ్లి అడ్డుకుంటున్నది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఆలోచలనన్నీ పెద్దలకు, భూకబ్జాదారులకు, భూ స్వాములకు భూములు రాసివ్వాలన్నది తేటతెల్లమయిందని విమర్శించారు. సమావేశంలో ఆయన వెంట రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఉన్నారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో గణపతిరావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఈ నెల 24వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని డీఆర్వో గణపతిరావు తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ థియరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఫస్టియర్‌కు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకెండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 5 నుంచి 9వ తేదీ వరకు ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకెండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నపత్రాల పంపిణీ, సమయ పాలనపై పలు సూచనలు చేశారు.

నేడు ఏపీఆర్ఎస్‌సీఏటీ పరీక్ష

విజయనగరం పూల్‌బాగ్: జిల్లా వ్యాప్తంగా శనివారం జరగనున్న ఏపీఆర్ఎస్‌సీఏటీ, ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి సూచించారు. తన కార్యాలయంలో అధికారులకు సూచనలు చేశారు. ఏపీఆర్ఎస్‌సీఏటీ పరీక్షకు 1442 మంది, ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్ జేసీడీసీకి 121 మంది హాజరవుతారని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్లనిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల స్థాయి అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో శుక్రవారం సాయంత్రం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం మార్చి 2024 వరకు గడువు ఇచ్చినందున ఆలోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరయ్యేలా డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 29,845 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్టు తెలిపారు. మరో 41 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉందన్నారు. సమావేశంలో హౌసింగ్‌పీడీ రమణమూర్తి, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి, విద్యుత్‌శాఖ ఎస్ఈ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క రోజులోనే..!

- రోగులకు అందనున్న వైద్యసేవలు
- సర్వజన ఆస్పత్రిలో ఈవినింగ్ క్లినిక్ నిర్వహణ
- దూర ప్రాంత రోగులకు తీరనున్న కష్టాలు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏరోజుకారోజే చికిత్స లభించనుంది. సుదూర ప్రాంతాల నుంచే రోగులకు మరుసటి రోజున రావాల్సిన అవసరం తప్పనుంది. ఓపీ విభాగంలో చూపించుకున్న తర్వాత వైద్యులు పరీక్షలు రాస్తే ఆ రిపోర్టులు రావడానికి సాయంత్ర అయ్యేది. దీంతో రోగులు మరుసటి రోజు ఆ రిపోర్టులు చూపించుకోవడానికి వచ్చేవారు. ఈ క్రమంలో దూర ప్రాంతాల వారు ఇబ్బంది పడేవారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆస్పత్రికి వచ్చిన రోజే రోగికి అవసరమైన చికిత్స అందించే విధంగా చర్యలు చేపట్టింది. అందుకోసం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రత్యేక మైన ఓపీని నిర్వహించాలని సర్వజన ఆస్పత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సర్వజన ఆస్పత్రిలో శుక్రవారం నుంచి మధ్యాహ్నం నుంచి ఓపీ సేవలు ప్రారంభించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈవినింగ్ క్లినిక్ నిర్వహించనున్నారు.

ఒంటిగంట వరకు ఓపీ సేవలు

ఆస్పత్రిలో ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్యులు ప్రస్తుతం ఓపీ సేవలు అందిస్తున్నారు. ఆ సమయంలో వచ్చిన రోగులను వైద్యులు ఓపీవిభాగంలో పరీక్షించిన తర్వాత అవసరమైన వారికి వైద్య పరీక్షలు రాసి ఇస్తారు. వైద్య పరీక్షల కోసం రోగులు ల్యాబొరేటరీలో బ్లడ్ శాంపిల్ ఇచ్చిన తర్వాత రిపోర్టు రావడానికి సమయం పట్టడంతో మరుసటి రోజు రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. ప్రస్తుతం ఈవెనింగ్ క్లినిక్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ నిర్వహిస్తారు కాబట్టి ఈ ఓపీ నిర్వహించే సమయంలో రోగుల వైద్య పరీక్షల రిపోర్టులను పరిశీలించి అవసరమైన చికిత్స అందిస్తారు.

రోజుకు 250 మందికి వైద్య పరీక్షలు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి ఓపీకి 1000 నుంచి 1100 మంది వరకు రోగులు ప్రతిరోజూ వస్తున్నారు. వారిలో 200 నుంచి 250 మంది వరకు వైద్య పరీక్షలు అవసరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి నెలలో 71,740 పరీక్షలు, మార్చిలో 71,530 , ఏప్రిల్‌లో 84,796 వైద్య పరీక్షలు చేశారు.

అదనంగా ఓపీ సేవలు ప్రారంభం



ఆస్పత్రిలో మధ్యాహ్నం ఓపీ సేవలు ప్రారంభించాం. 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారు. వైద్య పరీక్షల రిపోర్టులను ఆ సమయంలో వైద్యులు పరిశీలించి రోగులకు చికిత్స అందిస్తారు.

డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

క్రీడా సందడికి వేళాయె..

- నేటి నుంచి జిల్లా వేదికగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు
- ఈనెల 20, 21 తేదీల్లో రాజీవ్ క్రీడామైదానం వేదికగా కబడ్డీ పోటీలు
- 21,22 తేదీల్లో కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఖోఖో పోటీలు
- అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీల నిర్వహణ
- తలపడనున్న 13 జిల్లాలకు చెందిన 800 మంది క్రీడాకారులు
- ఏర్పాట్లలో నిమగ్నమైన అసోసియేషన్‌ల ప్రతినిధులు



కబడ్డీ పోటీలకు ఆతిథ్యమివ్వనున్న రాజీవ్ క్రీడామైదానం

విజయనగరం: క్రీడల ఖిల్లాగా పేరొందిన విజయనగరం జిల్లాలో రాష్ట్రస్థాయి క్రీడా సందడికి వేళయింది. ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అండర్-19 విభాగంలో నిర్వహించే క్రీడా పోటీలకు విజయనగరం ఆతిథ్యమివ్వనుంది. కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో బాల, బాలికలకు నిర్వహించే పోటీలు ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ముందుగా ఈ నెల 20, 21 తేదీల్లో నగరంలోని రాజీవ్ క్రీడామైదానం వేదికగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనుండగా... ఈ నెల 21, 22 తేదీల్లో కార్పొరేషన్ కస్పా ఉన్నత పాఠశాల వేదికగా రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌తో పాటు కబడ్డీ, ఖోఖో అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో పూర్తయ్యాయి.

రాజీవ్ క్రీడామైదానంలో కబడ్డీ..కబడ్డీ..

నగరం నడిబొడ్డున గల రాజీవ్ క్రీడామైదానంలో రాష్ట్ర స్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన నిర్వహించే పోటీలకు సంబంధించి 13 జిల్లాలకు చెందిన బాల, బాలికల జట్లు తలపడనున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో రాష్ట్రంలో తొలిసారిగా మ్యాట్‌పై పోటీలు నిర్వహించేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుత వేసవిలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇండోర్, అవుట్ డోర్‌లలో పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా రాజీవ్ ఇండోర్ స్టేడియంలో రెండు మైదానాలు, బయట మరో రెండు మైదానాలు సిద్ధం చేశారు. ఇదిలా ఉండగా పోటీల్లో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి 400 మంది వరకు క్రీడాకారులు రానుండగా.. వారికి ప్రభుత్వ సంస్కృత పాఠశాల, బీపీఎం కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో వసతి సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు క్రీడాకారులకు భోజన వసతిని రాజీవ్‌క్రీడామైదానంలో ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు వెల్లడించారు. మొదటిరోజు పోటీలను ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించనున్నారు.

కస్పా ఉన్నత పాఠశాలలో ఖోఖో పోటీలు..

నగరంలోని కార్పొరేషన్ కస్పా ఉన్నత పాఠశాలలో ఈ నెల 21,22 తేదీల్లో రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయి అండర్-19 బాల, బాలికల విభాగంలో ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన నిర్వహిస్తుండగా... రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు తలపడనున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించే పోటీల్లో సుమారు 400 మంది క్రీడాకారులు హాజరుకానుండగా.. వారందరికీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్పా ఉన్నత పాఠశాలలో వసతి సుదపాయం కల్పించారు. క్రీడాకారులకు రెండు రోజులు భోజన సదుపాయాన్ని కస్పా ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

పోటీలను విజయవంతం చేయండి..

జిల్లా వేదికగా మూడు రోజుల పాటు జరిగే అండర్-19 స్కూల్ గేమ్స్ కబడ్డీ, ఖోఖో పోటీలను విజయవంతం చేయాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.ఈశ్వర్‌కౌశిక్, కాళ్ల సూరిబాబుతో పాటు డీవీఈఓ సురేష్‌కుమార్ జిల్లా ప్రజలను కోరారు. కబడ్డీ పోటీలు నిర్వహించే రాజీవ్ క్రీడామైదానంలో ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో మొదటి సారిగా స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలను మ్యాట్‌పై నిర్వహిస్తామన్నారు. కస్పా ఉన్నత పాఠశాలలో ఈ నెల 21,22 తేదీల్లో ఖోఖో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అవసరమైన భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పతివాడ శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.ఎ.బాలకృష్ణ, తవుడు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, డీవీఈఓ తదితరులు



రాజీవ్ ఇండోర్ స్టేడియంలో కబడ్డీ ఆడేందుకు సిద్ధం చేసిన సింథటిక్ మ్యాట్

క్లుప్తంగా

డ్రోన్ల వినియోగంపై అవగాహన



సదస్సును ప్రారంభిస్తున్న గజపతిరావు

పర్లాకిమిడి: డ్రోన్ల వినియోగంతో వ్యవసాయం లాభసాటిగా మారుతుందని వక్తలు పేర్కొన్నారు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడిలోని ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్ల వినియోగం, హైబ్రిడ్ విత్తనాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హైబ్రిడ్ మొక్కజొన్న, ఆర్.ఎన్.ఆర్.(డయాబెటిక్) విత్తనాల వినియోగం ద్వారా మంచి లాభాలు పొందవచ్చన్నారు. అంతకుముందు ఈ సదస్సును ఆర్.ఎం.సి.ఎస్.అధ్యక్షుడు ఎస్.గజపతిరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సెంచూరియన్ వర్సిటీ గెస్ట్ అధ్యాపకులు, మాజీ సంచాలకులు (అగ్రికల్చర్) ఎం.చంద్రశేఖర్‌రావు, ఎంఎస్.స్వామినాథన్ అగ్రికల్చర్ స్కూల్ అధ్యాపకుడు జె.అనిల్‌కుమార్, ఓర్మాస్ హెడ్ డాక్టర్ ప్రియంవద, రాయగడ సమితి జెడ్పీటీసీ పి.పీతాంబర్ నాయక్, జిల్లా రైతు సంఘం నాయకుడు సూర్యనారాయణ పట్నాయక్, గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, సెంచూరియన్ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రో, శ్రీకాకుళం, పరిసర గ్రామాల నుంచి 200మంది రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి రెండిళ్లు దగ్ధం



కాలిపోతున్న ఇళ్లు

రేగిడి: మండల పరిధిలోని పోరాం గ్రామంలో శుక్రవారం సాయంత్రం గ్యాస్ సిలిండర్ పేలి రెండిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన సింగరాతి దాలయ్య, సింగరాతి రాములుకు చెందిన ఇళ్లు కాలిబూడిదయ్యాయి. వారంతా ఉపాధిపనులకు వెళ్లిన తరువాత ఇంట్లో ఒక్కసారిగా పెద్దశబ్దం రావడంతో స్థానికులు ఏం జరుగుతుందోనని భయకంపితులయ్యారు. వెంటనే ఇంట్లో నుంచి మంటలు రావడాన్ని గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వంటసామగ్రి, ద్విచక్రవాహనం, తిండిగింజలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బొక్కేల రాంబాబులు సంఘటనా స్థలానికి వెళ్లి తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, ఆర్ఐ రేవతి, వీఆర్వో ఏవీ సత్యనారాయణలకు సమాచారం అందించారు. దీంతో వారితో పాటు ఎస్సై ఇ.శ్రీనివాస్, సిబ్బంది వచ్చి పరిశీలించారు.

సారా వద్దన్నందుకు గిరిజనుడి ఆత్మహత్య



భామిని:మృతుడు ఆరిక మోహనరావు(39)

భామిని: సారా తాగి ఆరోగ్యం పాడు చేసుకుని కుటుంబాన్ని అప్పుల పాలు చేయవద్దని భార్య మందలించడంతో మద్యం మత్తులో పురుగు మందు తాగి భర్త ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈ సంఘటనపై బత్తిలి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భామిని మండలం బొడ్డగూడకు చెందిన గిరిజనుడు ఆరిక మోహనరావు(39)గురువారం రాత్రి ఇంట్లో పురుగు మందు తాగడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సీతంపేట సీహెచ్‌ఎస్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు బత్తిలి ఏఎస్సై తులసినాయుడు కేసు నమోదు చేసి శుక్రవారం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి..

రాజాం సిటీ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై వీబీ రామకృష్ణారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి ఒమ్మి గ్రామానికి చెందిన చిత్తిరి కృష్ణ (29) ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 9న విధులు ముగించుకున్న అనంతరం స్వగ్రామం వెళ్తుండగా మార్గమధ్యంలో రోడ్డుపై ఉన్న స్టాపర్ బోర్డును బలంగా ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు 108 సహాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. శ్రీకాకుళంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య నాగమణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



కృష్ణ మృతదేహం

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి రైల్వేస్టేషన్ వద్ద హంసఫర్ రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు శ్రీకాకుళం జీఆర్‌పీ ఎస్సై చెల్లూరి శ్రీనువాసరావు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉండొచ్చన్నారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 7013273731 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



చీపురుపల్లి రూరల్: రైలు ఢీకొని మృతి చెందిన యువకుడు

పిడుగుపాటుతో వ్యక్తి..

పార్వతీపురం: మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో పెదబొండపల్లి గ్రామానికి చెందిన వంగపండు తాతబాబు (45)పై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పొలం పనులకు వెళ్లిన ఆయన గ్రామంలోని తామర చెరువు సమీపంలో నుయ్యివద్ద పిడుగుపడి మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



పార్వతీపురం: పిడుగుపాటుకు మృతిచెందిన తాతబాబు

పేదలంటే అంత చులకనా..?

- ప్రతిపక్ష నేత చంద్రబాబు తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

శృంగవరపుకోట: పేదల సొంతింటి కల అంటే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అంత చులకనా? మాజీముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత మాట్లాడాల్సిన తీరు ఇదేనా అంటూ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ గురువారం ఎస్.కోట వచ్చిన చంద్రబాబు పేదలను అపహాస్యం చేస్తూ సెంటున్నర స్థలంలో శ్మశానం, సమాధులే సాధ్యం కాదు. ఇక ఇల్లు ఏం కడతారనడం దుర్మార్గమన్నారు. అధికారం పోయిందన్న పిచ్చితనంతో చంద్రబాబు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 30లక్షల మంది జగనన్న కాలనీల్లో సుందరమైన ఇళ్లు కట్టుకుంటే వాటిని శ్మశానాలతో పోల్చడానికి సిగ్గులేదా? అని ప్రశ్నించారు.

పచ్చ కామెర్ల రోగిలా ప్రతిపక్ష నేత తీరు

ప్రతి స్కీమ్ ఒక స్కామ్ అన్న ప్రతిపక్ష నేత చంద్రబాబు తీరు పచ్చకామెర్ల రోగిలా ఉందని, నాడు-నేడు, చేయూత, పించన్ల పంపిణీ, ఆసరా, భరోసా, విద్యాదీవెన, వసతిదీవెన, గోరుముద్ద ఇలా ప్రతి పథకంలో నేరుగా లబ్ధిదారు ఖాతాకు నిధులు చేరుతుంటే స్కామ్ అనడానికి సిగ్గులేదా అని మండిపడ్డారు. దమ్ముంటే నియోజకవర్గంలో ఒక్క లబ్ధిదారుకైనా అన్యాయం జరిగినట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. వడ్డీమాఫీ అని పసుపు-కుంకుమ అని అక్కచెల్లెళ్లను మోసంచేసింది చంద్రబాబు అయితే నాటి డ్వాక్రా రుణాలను తీర్చి వారికి వడ్డీలేని రుణాలు ఇచ్చింది జగనన్న కాదా? బాబు వస్తే జాబు అని నీకొడుక్కి ఉద్యోగం ఇచ్చావు, జగన్ రాష్ట్ర వ్యాప్తంగా 4లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చింది నిజం కాదా? అని ధ్వజమెత్తారు. బుద్ధిలేని ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్న చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే అర్హత లేదు

విశాఖ రాజధానిగా ఎదగకూడదని అడ్డం పడుతున్న చంద్రబాబుకు ఉత్తరాంధ్ర కోసం మాట్లాడే అర్హత ఉందా? నాడు రాష్ట్ర విభజనకు సై అని, నిన్నటి వరకూ హైదరాబాద్‌లో కూర్చుని ఇప్పుడు నీతులు చెబుతున్నారని విమర్శించారు. అదే పనిగా అబద్దాలు చెప్పుకుంటూ పోతే ప్రజలు టీడీపీ నేతలను క్షమించరని అన్నారు.

ఆ కలయిక అ'పూర్వం'

- 30 ఏళ్ల తరువాత కలిసిన విద్యార్థులు

రాజాం సిటీ: వారంతా 30 ఏళ్ల క్రితం కలిసి వంగర మండలం కొప్పరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి (1989 నుంచి 1994) వరకు చదువుకున్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి శుక్రవారం రాజాంలోని ఓ హోటల్ వేదికైంది. 30 ఏళ్ల తరువాత కలుసుకున్న వారంతా ఒరేయ్ మహేష్ బాగున్నావా? వెంకటరమణ, లక్ష్మి, రమణమ్మ, శాంతి ఏం చేస్తునారు? ఎన్నాళ్లెందిరా నిన్ను చూసి అంటూ ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆప్యాయంగా రోజంతా గడిపారు. ఆనాటి జ్ఞాపకాలను, చిలిపి చేష్టలను నెమరువేసుకున్నారు. స్నేహభావాలు పెంపొందించుకుంటూ తాము చదివిన పాఠశాల అభివృద్ధితోపాటు సమాజాభివృద్ధికి తమ వంతు కృషిచేయాలని నిర్ణయించుకున్నారు. పేద విద్యార్థుల ఉన్నత చదువుకు సైతం ప్రోత్సాహం అందించేందుకు ముందుకొచ్చారు. అంతకు ముందు విద్యాబుద్ధులు నేర్పి క్రమశిక్షణతో తీర్చిదిద్దిన గురువులు మాచర్ల హరినారాయణ, జి.సత్యంనాయుడు, మర్రాపు అప్పలస్వామి, గుంటముక్కల శ్రీరామమూర్తి, సత్తారు ఆనందరావులను విద్యార్థులంతా ఘనంగా సత్కరించారు.



గురువులతో 30 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయంలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 31లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూగురుకులం.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కురుపాం, కొటికిపెంట, అనసభద్ర ఏకలవ్య కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ,హెచ్ఇపీ గ్రూపులలో 30 సీట్లు చొప్పున ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు జీఎల్ పురం ప్రిన్సిపాల్ ఫోన్ 6303508032 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు మౌలిక సదుపాయాలు

- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విజయనగరం ఫోర్ట్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సిప్డా పథకం ద్వారా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో విభిన్న ప్రతిభావంతులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. అంధులు, దివ్యాంగులు నడవడానికి అనువైన ఫ్లోరింగ్, రెయిలింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లాలో 71 ప్రభుత్వ శాఖలతో పాటు, తహసీల్దార్, మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాలను పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ గుప్త, ఆర్అండ్‌బీ ఈఈ రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం



నాలుగు రోడ్ల జంక్షన్ నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

గజపతినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సెంటున్నర భూమిని ఇస్తే చంద్రబాబు నాయుడు ఎస్.కోట పర్యటనలో చేసిన తన ప్రసంగంలో తప్పుడు ప్రచారం చేయడం తగదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గజపతినగరం మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం గజపతినగరంలోని నాలుగు రోడ్ల కూడలిలో బూడి వెంకటరావుతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు అంతా నల్ల బ్యాడ్జిలు ధరించి చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మను దహనం చేసి చంద్రబాబు నాయుడు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టని చంద్రబాబు నాయుడికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్న చంద్రబాబు నాయుడు చరిత్రలో సంస్కార హీనుడిగా మిగిలిపోతారని మండిపడ్డారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ కనకల సుబ్రహ్మణ్యం, సీనియర్ నేతలు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కడుపుట్ల పైడిపునాయుడు, కర్రి రామునాయుడు, కె.మోహన్ రావు, శీరరమణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్ఆర్‌సీపీలో చేరుతున్న టీడీపీ కార్యకర్తలు

సంతకవిటి: మండలంలోని కాకరాపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. ఈ మేరకు సంతకవిటి మండలపరిషత్ కార్యాలయం వద్ద రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు సమక్షంలో పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. గ్రామానికి చెందిన చాపల కృష్ణారావు, చాపల బలరాం, గోవిందరావు, మర్రి రామారావు, శ్రీనివాసరావు, యందవ రమణ, డొంకరి శ్రీరాములు, బైరెడ్డి శ్రీనివాసరావు, కర్రి ఆదినారాయణ, దాసరి వెంకటేశ్వరరావు, కొణపల నాగరాజు, గుత్తు వీర్రాజు, మర్రి ప్రసాద్, వావిలపల్లి రామకృష్ణ, నెల్లి ప్రసాద్, నెల్లి నారాయణరావు, నారాయణశెట్టి గోవిందరావు, వావిలపల్లి బాలకృష్ణ, చాపల చక్రపాణి, దొంతం జగన్నాథం, ఆబోతుల జగన్నాథం, గేదెల దాలిరాజు, ఆదినారాయణ తదితరులు టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీలో చేరినట్లు పంచాయతీకి చెందిన వైఎస్ఆర్‌సీపీ నేత వావిలపల్లి రమణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ అనుసరిస్తున్న విధానాలకు మంత్రముగ్ధులై వారంతా పార్టీలో చేరారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు అంతా కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సిరిపురపు మంజుల, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, వైఎస్ఆర్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ కంబాల సందీప్, మాజీ వైస్ ఎంపీపీ గంగ్రేటి కేసరి, కాకరాపల్లి సర్పంచ్ వావిలపల్లి ధనలక్ష్మి, రమణారావు, వావిలపల్లి శ్రీనివాసరావు, దాసరి దాలినాయుడు, పండు రాజగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ పండు పాపారావు, ఎంపీటీసీ ఇనమల శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 484.00
శ్రీకాకుళం	రూ. 484.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,800-00
బంగారం(22సి. 10గ్రా.)	56,650-00
వెండి (కిలో)	78,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹139	₹248	₹ 258

లైంగికదాడిపై కేసు నమోదు

పాలకొండ రూరల్: స్థానిక ఏరియా ఆస్పత్రిలో జరిగిన లైంగికదాడి ఘటనపై పోలీసులు కేసునమోదు చేశారు. ఈ కేసు గురించి పాలకొండ ఎస్సై బి.శివప్రసాద్ అందించిన వివరాలిలా ఉన్నాయి. తన సోదరుడు ఆరోగ్య సమస్యతో పాలకొండ ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరగా సీతంపేట మండలానికి చెందిన యువతి(19) సహాయకురాలిగా వచ్చి ఉంది. అయితే ఇదే వార్డులో పట్టణానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స నిమిత్తం ఇన్‌పేషెంట్‌గా చేరాడు. ఆరోగికి సహాయకుడిగా గారమ్మకాలనికి చెందిన యువకుడు ఉన్నాడు. సహాయకుడిగా వచ్చిన యువకుడు తనపై గురువారం రాత్రి ఆస్పత్రిలోని మరుగుదొడ్డిలో లైంగికదాడికి పాల్పడినట్లు బాధితురాలు పోలీసులకు అందించిన ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్సై తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

వంగర: మండల పరిధి అరసాడ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన సాయికుమార్ గాయాలపాలయ్యాడు. శుక్రవారం గ్రామం నుంచి రాజాం వైపు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వస్తుండగా బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడిపోయాడు. వెంటనే స్థానికులు 108 సమాచారం అందించడంతో సిబ్బంది విశ్వనాథం, పవన్‌లు ప్రథమ చికిత్స అందించి రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.